క్లుప్తంగా

పొదలకూరు తహసీల్దార్‌గా సారంగపాణి

పొదలకూరు : మండల తహసీల్దార్‌గా వాకాడు ఎంఎల్‌ఎస్ పాయింట్ డీటీగా పనిచేస్తూ సెలవులో ఉన్న సారంగపాణిని నియమించారు. ఇక్కడ తహసీల్దార్(ఎఫ్‌ఏసీ)గా ఉన్న శివకృష్ణ డీటీగా కొనసాగుతారు. ఇప్పటి వరకు డీటీగా ఉన్న సాయిగణేష్ తన రీ–సర్వే డీటీ స్థానానికి వెళ్లారు.

11న ప్రతిభా పురస్కారాల ప్రదానం

పొదలకూరు : ప్రతిభ చూపిన గౌడ్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు నెల్లూరు టౌన్‌హాల్లో జరుగుతుందని జిల్లా గౌడ్ కల్లుగీత పారిశ్రామిక సంఘం యువజన విభాగం అధ్యక్షుడు తాళ్ల రాజా ఆదివారం తెలిపారు. గౌడ్ సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో వీరికి అభినందన సభ జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 184 మంది విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తామన్నారు. అధిక సంఖ్యలో కల్లుగీత పారిశ్రామిక వేత్తలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ నేడు

నెల్లూరు(బారకాసు) : తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం అర్జీలు(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) స్వీకరిస్తామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్ వంటి వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలియజేశారు.

చాముండేశ్వరీదేవికి విశేష పూజలు



పూజలు చేస్తున్న దేవాంగ సంఘీయులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని చాముండేశ్వరీదేవి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా విజయసారథి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం నాయకులు వెంకటసురేష్, శంకరయ్య, మాధవయ్య, శ్రీనివాసులు, ఠాగూర్, రాజేంద్ర ప్రసాద్, జయప్రకాష్, హరి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత సంబరం

• సాయివేద వాగ్దేవికి కళాంజలి అవార్డు



సాయివేద వాగ్దేవిని సత్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో కళాంజలి సంగీత సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాంజలి సాంస్కృతిక సంస్థ–నెల్లూరు అధ్యక్షుడు కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో అన్నమయ్య కీర్తనలు, సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ పాడిన సినీగీతాలు అలరించాయి. ఈ సందర్భంగా జీ లిటిల్ చాంప్స్ విజేత సాయి వేద వాగ్దేవికి కళాంజలి అవార్డును ప్రదానం చేశారు. అలాగే గాయకులు జ్ఞానశ్రీ, అనూష, గాయత్రి, అజిత్‌రామ్, శ్రీకృతిచే 'స్వరఝురి' వీనులవిందుగా సాగింది. లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, విశ్వ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ, టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, కళాంజలి గౌరవాధ్యక్షుడు వీరిశెట్టి హజరత్ బాబు, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు హాజరై అవార్డులను అందజేశారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. నగరంలోని 53, 54 డివిజన్ల పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రాంతంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మూలం ప్రసాద్, భయ్యన్న, వెంకటరత్నం, వేణు, శ్రీనివాసులు, సుధా, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సాగుబడి

సాగులో మెళకువలు, కొత్త వంగడాలపై ప్రయోగాలు, తక్కువ నీటితో సాగు చేయడం, కాలానుగుణంగా ఎలాంటి పంటలను సాగు చేయాలి.. వంటి ప్రయోగాలకు వేదికైంది పొదలకూరులోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల. దాదాపు 60 మంది విద్యార్థినులను ఆధునిక సాగు పద్ధతుల వైపు అడుగులు వేయిస్తూ మెరుగైన ఫలితాల సాధన కోసం ఏజీ కళాశాల కృషి చేస్తోంది.

- ఏజీ పాలిటెక్నిక్ కాలేజీలో రెండేళ్ల కోర్సు
- తక్కువ నీటితో పంటల సాగు
- ఆధునిక వ్యవసాయంపై అవగాహన
- కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు



క్షేత్రస్థాయిలో సాగు పనులు పాలిటెక్నిక్ విద్యార్థినులు

పొదలకూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థినులకు పాలిటెక్నిక్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి కౌన్సెలింగ్ ద్వారా ఇక్కడ ఏజీ పాలిటెక్నిక్ రెండేళ్ల కోర్సు కోసం విద్యార్థినులు చేరుతున్నారు. పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన ఏజీ పాలిటెక్నిక్ కాలేజీ కేవలం విద్యార్థినులకు మాత్రమే కేటాయించారు. ప్రారంభంలో కొన్నేళ్లు ఇక్కడ కో–ఎడ్యుకేషన్ ఉన్నప్పటికీ తర్వాత సోమశిలలో మగపిల్లలకు ప్రత్యేకంగా కళాశాలను కేటాయించారు. ప్రస్తుతం కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 60 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరేవారికి కౌన్సెలింగ్ ద్వారా సీట్లను కేటాయిస్తున్నారు. ఏజీ పాలిటెక్నిక్‌లో ఆరుమాసాలు వ్యవసాయ భాగస్వామ్యం కింద విద్యార్థినులు వారే పంటలు పండించి దిగుబడులను మార్కెటింగ్ చేస్తారు. తక్కువ నీటితో యాజమాన్య పద్ధతుల ద్వారా రైతు తన పంటను ఎలా కాపాడుకుంటారో విద్యార్థులు నాలుగు విభాగాలుగా విడిపోయి వ్యవసాయం చేయాల్సి ఉంటుంది.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎన్జీ రంగా వర్సిటీ పూర్వ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి(ఫైల్)

సబ్జెక్టులు ఇలా ఉంటాయ్

పాలిటెక్నిక్‌లో వ్యవసాయానికి సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. అగ్రానామి(పంటల యాజమాన్యం), ఎంటమాలాజీ(కీటకాలు), పెథాలజీ(చీడపీడలు), సాయిల్ కెమిస్ట్రీ(భూసారం), ఫర్టిలైజర్స్(ఎరువులు), అగ్రికల్చరర్ ఎకనామిక్స్(వ్యవసాయ అర్థశాస్త్రం), అగ్రికల్చరర్ ఎక్స్‌టెన్షన్(వ్యవసాయ విస్తరణ), అగ్రికల్చరర్ ఇంజనీరింగ్(పంపుసెట్లు) ఉంటాయి. వీటిపై సెమిస్టర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్‌లో భాగంగా ఆరుమాసాల పాటు విద్యార్థినులకు ఫీల్డ్ వర్క్ అంటే వ్యవసాయ భాగస్వామ్యం అపరాల సాగు చేసి దిగుబడి సాధించడంతో పాటు పండించిన పంటలను మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది.

కౌన్సెలింగ్ ద్వారా చేరుతున్నారు

ఏజీ పాలిటెక్నిక్ విద్యార్థినులకు గుంటూరులో కౌన్సెలింగ్ జరుగుతుంది. ప్రస్తుతం మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిన వారు ఇక్కడ చేరుతున్నారు. ఏజీ పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం 30 మంది, ద్వితీయ సంవత్సరం 30 మంది విద్యార్థినులు ఉంటారు. పూర్తిస్థాయిలో విద్యార్థినులు చేరిన తర్వాత క్లాసులను ప్రారంభిస్తాం. కోర్సులో భాగంగా ఆరునెలల పాటు పంట సాగు ఉంటుంది.

– ప్రసన్నరాజేష్, ప్రిన్సిపల్, ప్రధాన శాస్త్రవేత్త, పొదలకూరు



విద్యార్థులు సాగుచేస్తున్న మెట్టపంటలు

కళాశాలలో అపరాల సాగు

ఏజీ పాలిటెక్నిక్ విద్యార్థినులు అపరాల సాగు చేస్తుంటారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి వేరుశనగ, జొన్న, పెసర, మినుము పంటల సాగు చేస్తున్నారు. వేరుశనగలో ధరణి రకం 105 నుంచి 110 రోజుల్లో చేతికందే పంట. కదిరి–9 రకం కూడా 110 రోజుల్లో చేతికి అందుతుంది. ఈ రకాలను ప్రస్తుతం సాగు చేస్తున్నారు. పెసరలో డబ్ల్యూజీజీ–42(వరంగల్) 55 నుంచి 60 రోజుల పంట, ఐపీఎం 2–14 రకం 60 నుంచి 65 రోజుల్లో చేతికందే పంట. ప్రధానంగా ప్రమాదకరమైన పల్లాకు తెగులు తట్టుకుంటున్న పెసర పంట కావడంతో రైతులకు వివరించేందుకు ఉపయోగపడుతుంది. జొన్న, మినుము పంటల సాగు కూడా చేస్తున్నారు. సజ్జ, కంది, జొన్న పంటల సాగు చేస్తూ రైతులకు సాగులో మెళకువలను వివరిస్తుంటారు.

వర్షాధారంగానే..

వ్యవసాయ పరిశోధనా స్థానంలో సాగు చేస్తున్న పంటలకు నీటి లభ్యత తక్కువగా ఉండడం వల్ల ఖరీఫ్‌లో వర్షాధారంగానే పంటలను పండిస్తారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉండడం వల్ల ట్రయిల్ సాగుకు వచ్చిన ఇబ్బందులు ఉండవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా పరిశోధనా స్థానంలో నీటి లభ్యత కోసం వ్యవసాయ నీటి కుంటను తవ్వించారు.



పంటల సాగు కోసం తవ్వించిన నీటికుంట

సమస్యల వలయంలో తెల్లమిట్ట గిరిజన కాలనీ



తెల్లమిట్ట గిరిజన కాలనీలో ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నేతలు

• పరిష్కరించాలని డిమాండ్

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం తెల్లమిట్ట గిరిజన కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని, వెంటనే పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ తెల్లమిట్ట గిరిజన కాలనీలో సమస్యలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. రోడ్లపై నడవలేని విధంగా గుంతలు పడి ఉన్నాయని తెలిపారు. వర్షాలొస్తే రోడ్లపై పూర్తిగా నడవలేని పరిస్థితి నెలకొంటోందన్నారు. ఈ కాలనీలో 50 గిరిజన కుటుంబాలు నివసిస్తుండగా వీరు కనీస వసతులకు దూరంగా పాకల్లో జీవిస్తున్నారన్నారు. వీరికి పక్కా గృహాల సదుపాయం కల్పించడంలో అధికారులు అలక్ష్యం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. కాలనీలో 50 మంది చిన్నారులు ఉన్నారని, వీరు ఎంతో దూరంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లలేక విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీ పక్కనే ఉన్న శ్మశానానికి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల దయనీయ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.రమణయ్య, ఉపాధ్యక్షుడు డి.కామేశ్వరరావు, కోవూరు పట్టణ కార్యదర్శి యస్దాని, సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, చెంచయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

యాష్‌పాండ్ గండిపై విచారణ జరపాలి

ముత్తుకూరు : నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్టు యాష్‌పాండ్‌కు గండిపడిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు యాష్‌పాండ్‌కు పడిన గండిని సీపీఎం కార్యదర్శి మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, గడ్డం అంకయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాసిరకంగా బూడిద చెరువును నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. తుప్పు పట్టిన బూడిద పైపులను మార్చాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బస్టాండ్‌లో ఆక్రమణల తొలగింపు

పొదలకూరు : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారిన ఆక్రమణలను పోలీసు అధికారులు ఆదివారం తొలగించారు. సీఐ ఆర్.రాంబాబు, ఎస్సై డి.రామకృష్ణ తమ సిబ్బందితో బస్టాండ్ వద్దకు వెళ్లి రోడ్డు మీదకు వచ్చిన పూల దుకాణాలను సర్దుబాటు చేయించారు. ఇకపై ట్రాఫిక్‌కు పూల దుకాణదారులు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణదారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.



పూల దుకాణాలను తొలగిస్తున్న సీఐ, ఎస్సై

బుచ్చిలో ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం

• సీఐ హైమారావు



ట్రాఫిక్ నిబంధనల గురించి వివరిస్తున్న సీఐ హైమారావు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పని చేస్తున్నారని సీఐ హైమారావు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీఐ ఆదివారం పర్యటించారు. ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కార్యాచరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్ కూడలి, అంబేడ్కర్ విగ్రహం, బాంబేరోడ్డు, చెన్నూరురోడ్డు, రాజశేఖరరెడ్డి విగ్రహం కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాలు పార్కింగ్ చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతామన్నారు. వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనదారులు సంబంధిత పత్రాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. కొందరు ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సీరియల్ ప్రకారం ఆటోలు నిలుపుకుని ఆర్టీసీ బస్సులకు ఆటంకం కలిగించకుండా ప్రయాణికులను ఎక్కించుకు వెళ్తే ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదన్నారు. ఆటోల్లో లౌడ్‌స్పీకర్లు, అధిక శబ్దాలను ఏర్పరిచే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొలగమూడిలో కోడిపందేలు

• దాడులు చేసిన పోలీసులు

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారం అందడంతో సీఐ సుబ్బారావు తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో పందెంరాయుళ్ల వద్ద నుంచి భారీగా నగదు, కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై సీఐ మాట్లాడుతూ పందెంరాయుళ్ల నుంచి కేవలం రూ.6 వేలు మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే వాస్తవానికి ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారో ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

రూ.10 కాయిన్స్ తీసుకోవాలి

పొదలకూరు : రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.పది కాయిన్స్ తీసుకోవద్దని ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ చాలా మంది వ్యాపారులు తీసుకోవడం లేదని పొదలకూరు మెడికల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదూరు వెంకటసుబ్బయ్య అన్నారు. రూ.10 కాయిన్స్ తీసుకోవాలని కోరారు. రూ.10ల నోట్లు కొత్తవి రాకపోవడం వల్ల వ్యాపారులు చిల్లర ఇవ్వాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నట్లు చెప్పారు. తన మెడికల్ షాప్ వద్ద రూ.పది కాయిన్స్ స్వీకరిస్తానని బోర్డు కూడా పెట్టిస్తున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన నేడు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలపై కొడవలూరులో సోమవారం అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జి.వసంతకుమారి ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగే సదస్సుకు మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్‌ఎంటీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓఏలు తప్పక హాజరు కావాలని కోరారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల పెంపు కోసం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

చీకట్లో నాగమాంబపురం



గ్రామంలో వెలగని వీధిలైట్లు

• పది రోజులుగా వెలగని వీధిలైట్లు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని నాగమాంబపురం గ్రామంలో పదిరోజులుగా వీధిలైట్లు వెలగడంలేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట వీధుల్లో నడవాలంటే బెంబేలెత్తిపోతున్నారు. వర్షాకాలం కావడంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు, పొలం పనులకు వెళ్లే రైతులు రాత్రిపూట చీకట్లో ఇంటికి చేరుకోవాలంటే అవస్థలు తప్పడం లేదు. ఈవిషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా రేపు, ఎల్లుండు అంటూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సోమిరెడ్డి ఆరోపణలు అవాస్తవం

మనుబోలు : గత ప్రభుత్వ హయాంలో అక్కంపేట గ్రామంలో ఇరిగేషన్ పనుల్లో భారీ అవినీతి జరిగిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన అక్కంపేట గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తాను దేవాన్ష్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో సుమారు రూ.5.90 కోట్ల విలువైన పనులు చేసి అక్రమాలకు పాల్పడినట్లు సోమిరెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. క్లాస్–3 కంపెనీ అయిన దేవాన్ష్ రూ.50 లక్షలకు పైబడి కాంట్రాక్టులు దక్కించుకునే అవకాశం లేదన్నారు. తాను అక్కంపేటలో రూ.53 లక్షల విలువైన ఎఫ్‌డీఆర్ పనులు మాత్రమే చేసినట్లు వెల్లడించారు. నీరు చెట్టు పేరుతో టీడీపీ హయాంలో చేసిన ఇరిగేషన్ పనుల్లో భారీగా అవినీతి చోటుచేసుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న కిరణ్‌రెడ్డి

వైద్య శిబిరానికి విశేష స్పందన

ముత్తుకూరు : ముత్తుకూరు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో డాక్టర్ హేమలతారెడ్డి న్యూరో స్పెషాలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పక్షవాతం, ఫిట్స్, మైగ్రేయిన్ తలనొప్పి, వణుకుడు, నరాల వ్యాధులతో బాధపడుతున్న 120 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



పరీక్షిస్తున్న డాక్టర్ హేమలతారెడ్డి

ఆర్టీసీ నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం



వినియోగంలో లేని బస్‌షెల్టర్



కేఆర్‌పురంలో బస్సులు ఆగే చోట షెల్టర్ లేక ఎండలో వేచి ఉన్న విద్యార్థులు

- నిరుపయోగంగా బస్‌షెల్టర్లు
- ఎండా, వానకు ప్రయాణికుల అవస్థలు

మనుబోలు : బస్సు ప్రయాణమే సురక్షితమంటూ తరచూ డ్రైవ్‌లు నిర్వహించే ఆర్టీసీ.. అందుకు తగ్గట్లు ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బస్సులు ఆగే చోట షెల్టర్‌లు లేకుండా, అవసరం లేనిచోటు నిర్మించారు. మనుబోలు కోదండరామపురం తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉంది. బస్సులు ఆగే మెయిన్ సెంటర్‌ను వదిలేసి బైపాస్ రోడ్డు నుంచి ఉన్న సర్వీస్ రోడ్డు పక్కన బస్ షెల్టర్ నిర్మించారు. ఇక్కడ బస్సులు ఆగే వెసులుబాటు లేకపోవడంతో ఇది నిరుపయోగంగా మారింది. దీనికితోడు గ్రామానికి దూరంగా ఉండడంతో ఒక్కరు కూడా దీని చాయలకు రావడం లేదు. కోదండరామపురంలో బస్సులు ఆగే రెండు చోట్ల షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఎండకు వానకు వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీని గురించి ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బస్సులు ఆగేచోట షెల్టర్‌లు నిర్మించాల్సిన అవసరం ఉంది.